క్లుప్తంగా

కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి

నరసరావుపేట రూరల్: కేతముక్కల అగ్రహారంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై రూరల్ పోలీసులు దాడి చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.23 వేల నగదు, 19 మోటర్ సైకిల్స్, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు మండలంలోని కేతముక్కల అగ్రహారం శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో రూరల్ ఎస్ఐ కిషోర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. కోడిపందేలు నిర్వహిస్తున్న 18 మందితో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆధార్ సేవలు ప్రారంభం

శావల్యాపురం: స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో నూతంగా ఆధార్ శిబిరం ఏర్పాటు చేసినట్లు శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజరు వలేటి శివకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ కేంద్రంలో అడ్రస్ మార్పులు, చేర్పులు, నూతన ఆధార్ నమోదు తదితర సేవలను అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈసేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెంటరు ప్రతినిధి పొట్ల హనుమంతరావు కోరారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని అలవాల అచ్చయ్యపాలెం శివారు మృత్యుంజయపురంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి తిరునాళ్లను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు పొంగళ్లు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆరేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ల కూడా నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ప్రత్యేక భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రొంపిచర్ల పోలీసులు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

మద్యానికి దూరంగా ఉండండి

డీ అడిక్షన్ కేంద్రాన్ని పరిశీలించిన ఈఎస్ మణికంఠ



నరసరావుపేటటౌన్: మద్యం సేవించటం వలన కలిగే దుష్ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని దానికి దూరంగా ఉండాలని పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మణికంఠ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం ఏరియా వైద్యశాలలోని డి అడిక్షన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సైకియాట్రిస్ట్ డాక్టర్ సతీష్‌ను కలిసి హాస్పిటల్‌లో ఉన్న లిక్కర్ యడిక్టెడ్ పేషెంట్ల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారితో మాట్లాడి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. లిక్కర్ త్రాగటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.సోమయ్య, సబ్-ఇన్‌స్పెక్టర్ కె. మురళి కృష్ణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ సేవలు అభినందనీయం

ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు

శావల్యాపురం:సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ వారి సారథ్యంలో వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రం శావల్యాపురం ప్రధాన కూడలి మార్గం గుంటూరు-కర్నూలు రహదారి వెంబడి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు మాట్లాడుతూ గత 16 సంవత్సరాల నుంచి నిర్విరామంగా స్వచ్ఛందంగా వేసవికాలం రెండు నెలల పాటు మట్టి కుండల్లో చల్లటి నీరు పోసి ప్రజల దాహార్తి తీర్చటం సొసైటీ సేవలకు నిదర్శమన్నారు. ప్రతి ఏడాది వేసవి కాలంలో అడవి పేరంటాళ్ళమ్మ తిరునాళ్ల వేడుకల్లో అమ్మవారిని దర్శించుకునే భక్తులకు కూడా సైతం కూలింగ్ వాటర్ వితరణ చేయటం అభినందనీయమన్నారు. సొసైటీ కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్ చందు మాట్లాడుతూ వారంలో ప్రతి బుధవారం ప్రత్యేకంగా మజ్జిగ కూడా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మతుకుమల్లి గ్రామ మాజీ సర్పంచ్ ముండ్రు హనుమంతరావు, ఏసురాజు, కాకాని నారాయణరావు, గణపర్తి వెంకటేశ్వర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల్లో ఫలితోత్సాహం

- కష్టానికి తగ్గ ఫలితం దక్కినందుకు ఆనందోత్సాహాలు
- మిఠాయిలు తినిపించి ఆనందపడ్డ తల్లిదండ్రులు

విద్యార్థి జీవితంలో ఇంటర్‌మీడియెట్ ప్రస్థానం ఓ సువర్ణాధ్యాయం. అక్కడే వారి జీవిత మలుపు తిరుగుతుంది. రెండేళ్లపాటు పడ్డ కష్టం ఫలితాల రూపంలో వారి భవితవ్యాన్ని నిర్దేసిస్తుంది. శనివారం విడుదల అయిన ఇంటర్ ఫలితాలు అదే విషయాన్ని స్పష్టం చేశాయి. ఆశించిన మేర మార్కులు వచ్చిన వారు మిఠాయిలు పంచుకుని ఆనందపడితే.. ఒకటీ రెండు మార్కులు తగ్గిన వారు నిరాశపడిన సందర్భాలు లేకపోలేదు. అయితే మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుందామని తల్లిదండ్రులు వారికి భరోసా కల్పించి భుజం తట్టారు.



రొంపిచర్లలో విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవినాయిక్



నరసరావుపేటలో విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్





ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



436 మార్కులు సాధించిన అశ్విత



936 మార్కులు సాధించిన శేషారత్నం



సివిక్స్‌లో టాపర్‌గా నిలిచిన ఇందు



కె. మేఘన (బైపీసీ-983)



ఎ.గౌరి (ఎంపీసీ-928)



జె విజయలక్ష్మి (ఎంఈసీ-827)



వై సాగరిక (జూ.ఎంపీసీ -451)

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో గల పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్-జూనియర్ కాలేజి విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మార్చి నెలలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన విడుదల అయిన ఫలితాలలో తమ కాలేజీలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ లో జి. శివకోటేశ్వరమ్మ 963/1000 మార్కులు, పి.రాజేశ్వరి 963/1000, సీనియర్ ఇంటర్ బైపీసీలో యం.హారిక 966/1000, సీనియర్ సీఈసీలో ఓ. శివకుమార్ 924/1000 మార్కులు సాధించారని అన్నారు. అదే విధంగా జూనియర్ ఇంటర్ ఎంపీసీలో జి. నవ్యశ్రీ 452/470, జూనియర్ బైపీసీలో ఎస్. శివప్రియాంక 409/440, జూనియర్ సీఈసీలో జీవియస్ రోహిత 467/500 మార్కులు సాధించారన్నారు. కళాశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, సహకరించిన అధ్యాపకులను, ప్రిన్సిపాల్ డాక్టర్ రవినాయక్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియ జేశారు.

సత్తాచాటిన వాగ్దేవి విద్యార్థులు

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రకటించిన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు వెల్లడించారు. జూనియర్ ఇంటర్‌లో 92 శాతం, సీనియర్ ఇంటర్‌లో 94 శాతం ఉత్తీర్ణతతో టౌన్ మొదటి స్థానం సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఓగిబోయిన వెంకటేష్ 465, బత్తుల మౌనిక 464, కుందుర యశ్వంతరెడ్డి 464, పోతురాజు యమున 464, నేరెళ్ల తనుశ్రీ 464, మరో 100 మంది 450 నుంచి 465 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో వంకుడావత్ సంతోష్ నాయక్ 970 మార్కులు, సీఇసీలో కంచర్ల చంద్రశేఖర్ 915, సీనియర్ ఇంటర్‌లో కుంచాల శ్రవణాంజలి 989, గుండాల సిరి 986, కోలకుట్ల మహేష్‌బాబు 979, మరో 136మంది 950 నుంచి 985వరకు మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాదు, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు అభినందించారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: శనివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కేజీబీవీల్లో ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 85 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 75 మంది ఉత్తీర్ణత సాధించారని, అలాగే ద్వితీయ సంవత్సరం 31 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 25 మంది ఉత్తీర్ణత సాధించారని 85.8 ఉత్తీర్ణత శాతంతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ వి.పద్మావతి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో టి. శేషారత్నం 930 మార్కులతో టాపర్‌గా, మొదటి సంవత్సరంలో ఆర్. అశ్విత 463 మార్కులు సాధించి నియోజకవర్గంలోనే తృతీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే సీఈసీలో కె.ఇందు సివిక్స్ సబ్జెక్టులో 98 మార్కులు సాధించి రాష్ట్రంలో టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే కేజీబీవీలో ద్వితీయ సంవత్సరంలో ఐదుగురికి గాను నలుగురు విద్యార్థులు, ప్రథమ సంవత్సరం 24 మందికి గాను 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో లీలావతి తెలిపారు.

వినుకొండలో...

వినుకొండ: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. సీటీ గ్రూపులో ఎం. సాయి అవినాష్ 1000 మార్కులకు గాను 940 మార్కులు సాధించి కళాశాల ప్రథమస్థానంలో నిలిచారని, ఎంఎల్‌టీ విభాగంలో ఎస్‌కే సల్మా 931, బైపీసీలో ఎస్‌కే నజీని 929 మార్కులు , కంప్యూటర్ సైన్స్ విభాగంలో పి.సంతోష్ 935 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో నాదెండ్ల మండల విద్యార్థులు సత్తా చాటారు. చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో సెకండియర్ 86 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 73 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్ 99 మంది పరీక్షకు హాజరుకాగా, 71 మంది (72 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో వెయ్యి మార్కులకు గాను బైపీసీలో కె.మేఘన 983 మార్కులు, ఎంపీసీలో ఎ.గౌరి 928 మార్కులు, ఎంఈసీలో జె.విజయలక్ష్మీ 827 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో వై సాగరిక 451 మార్కులు, బైపీసీలో టి.బ్యూలా 419 మార్కులు, సీఈసీలో ఎం సరారాణి 415 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ ఝాన్సీవాణి, అధ్యాపకులు అభినందించారు.

గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో సీనియర్ ఇంటర్ బైపీసీలో నూరు శాతం, ఎంపీసీలో 80 శాతం, సీఈసీలో 85 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో షేక్ అప్స 909 మార్కులు, బైపీసీలో షేక్ సమీర్ కళాశాల టాపర్లుగా నిలిచారు. జూనియర్ బైపీసీలో ఎండీ జబేర్‌ఖాన్ 457 మార్కులు సాధించారు. ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ చైతన్యలు అభినందించారు. నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయలో సెకండియర్‌లో 23 మందికి గాను 17 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 32 మంది పరీక్షకు హాజరుకాగా 21 మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ఎస్వో మాధవీలత అభినందించారు.

శావల్యాపురంలో బాలికల సత్తా

శావల్యాపురం: మండల కేంద్రంలో బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి తమ సత్తా చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూనియర్ కళాశాల్లో ఇంటరు ప్రథమ సంవత్సరం-ఎంపీసీ విభాగంలో-30 మందికిగాను 21 మంది ఉత్తీర్ణత సాధించగా యం.వెంకట రమణ-445 మార్కులు సాధించగా, బైపీసీ విభాగంలో 07 మందికిగాను 04 మంది పాసైనట్లు తెలిపారు. రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో -20 మంది పరీక్షలు రాయగా 15 మంది పాసైనారు. అత్యధికంగా 1000 మార్కులకు గాను 968 మార్కులు ఓర్సు జ్యోతి సాధించినట్లు తెలిపారు. బైపీసీ విభాగంలో 12 మందికి గాను 10 మంది పాసైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. 1000 మార్కులు గాను 873 మార్కులు ఎస్.మహిమరాణి సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఐక్యంగా సమిష్టి కృషి ఫలితంగా మెరుగైన మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్ ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, పి.సురేష్‌కుమార్, రవి, వి.శ్రీనివాసరావు, కవిత, విమలకుమారి, కిరణ్మయి, స్టాప్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, భువనేశ్వరి, శ్రీకాంత్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.



ఓర్సు జ్యోతి (968 మార్కులు ఎంపీసీ)



మహిమరాణి (873 మార్కులు, బైపీసీ)



షేక్ అప్స (ఎంపీసీ-909)



ఎండీ జుబేర్‌ఖాన్ (జూ.బైపీసీ-457)

విశ్వసాయి విద్యార్థుల ప్రతిభ



వినుకొండలో విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసశర్మ

వినుకొండ: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో బి.అక్షిత 465 మార్కులతో స్టేట్ 3 ర్యాంక్, టౌన్ ఫస్ట్, డి.ఉషశ్రీ 464 స్టేట్ 4వ ర్యాంక్ టౌన్ సెకండ్ ర్యాంక్‌లు, బైపీసీ విభాగంలో జె.అభిజ్ఞ 434 మార్కులు సాధించి స్టేట్ 2వ ర్యాంక్, టౌన్ ఫస్ట్ సాధించిందన్నారు. సీఈసీ విభాగంలో షేక్ రిజ్వాన 458 మార్కులు, ఎంఈసీ విభాగంలో డి.చంద్రిక 315, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో దోసపాటి వైష్ణవి 986 టౌన్ సెకండ్, బైపీసీలో కె.వైష్ణవి 917 మార్కులు, ఎంఈసీలో ఉమామహేశ్వరి 773, సీఈసీ విభాగంలో ఆర్. పవిత్ర 811 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు అభినందించారు.

డీఆర్ ప్రకాష్ విద్యాసంస్థ ప్రభంజనం



విద్యార్థినులతో చైర్మన్ లక్ష్మీరెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం విడుదలైన ఇంటర్మీడియేట్ ఫలితాల్లో స్థానిక డీఆర్ ప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ మార్కులతో ప్రభంజనం సృష్టించారు. మొదటి ఏడాది విద్యార్థిని డి.మానస 465 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు పొందిందన్నారు. రెండవ ఏడాది విద్యార్థిని వి.పుష్పకల్పన 983 మార్కులు సాధించింది. సంస్థ చైర్మన్ కొండారెడ్డి లక్ష్మీరెడ్డి, ప్రిన్సిపాల్ షేక్ మీర్జా, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

పన్ను వసూళ్లతోనే అభివృద్ధి సాధ్యం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



రెవెన్యూ అధికారికి మెమెంటో అందజేస్తున్న చైర్మన్ రఫాని, మున్సిపల్ ఆర్డీ ఎస్ హరికృష్ణ

చిలకలూరిపేట: పన్ను వసూళ్లతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని, పన్ను వసూళ్లలో ప్రతిభ చూపిన ఉద్యోగులను సన్మానించుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్లలో ప్రతిభ కనపరిచిన రెవెన్యూ ఆఫీసర్ పి.సుబ్బారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అబ్దుల్ ఖాదర్, గిరిబాబులను మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం సన్మానించారు. వీరితో పాటుగా పన్ను వసూళ్లలో చక్కటి ప్రతిభ కనపరిచిన ఆరుగురు సచివాలయ అడ్మిన్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ రఫాని మాట్లాడుతూ సమిష్టి కృషితో రెవెన్యూ సిబ్బంది అత్యధిక వసూళ్లు సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఎస్ హరికృష్ణ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా వసూళ్లు కాని మొండి బకాయిలను రెవెన్యూ సిబ్బంది వసూలు చేయడం అభినందనీయమన్నారు. ప్రణాళిక బద్ధంగా మొండి బకాయిలు వసూలు చేయడంతో గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ. 4.5 కోట్లు అదనంగా ఆస్తి పన్ను వసూలు చేయడం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ.. అధికారులపై చర్యలు తీసుకోండి

కత్తవ చెరువు, వాగు ఆక్రమణలపై పీడీఎం నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న రామకృష్ణ

నరసరావుపేట: కత్తవ చెరువు, వాగు ఆక్రమణల తొలగింపులో తమకు సంబంధం లేదని, ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తప్పుకుంటున్న మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకొని, ఆక్రమణలు తొలగించి ప్రజలు ముంపుకి లోను కాకుండా చర్యలు తీసుకోవాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు కోరారు. శనివారం కత్తవ చెరువు సమీపంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ ఎక్కడైనా ఏదైనా కట్టుబడి జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారి అక్కడికి వెళ్ళటం, పరిశీలించటం పరిపాటని అన్నారు. వాగు చెరువు ఆక్రమణలపై మీడియా వాళ్ళు మాట్లాడితే ఒకసారి ప్రైవేట్ భూమి అని, మరోసారి విచారిస్తున్నామని, చివరికి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు తేల్చాలని ప్రకటించారన్నారు. కత్తవ చెరువు కాలువ, భూమి ఆక్రమించి ఎన్నడూ లేని పద్ధతులలో ఒకవైపు కట్టుబడి జరుగుతుంటే, మరోవైపు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల తెలియజేశామని దాటవేయటం ఎంతవరకు సరైందని ప్రశ్నించారు.

వీరి వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. నెల రోజుల క్రితం గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చిన సందర్భంలో కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ చెప్పిన ఇప్పటివరకు చర్యలు లేవని, అసలు కారణం ఏమిటో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి




నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు కోనసీమ ముమ్మిడివరంకు చెందిన దూమా నాగమణి (31) రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ కుమార్తె, కుమారుడితో కలిసి మంగళగిరిలో తన సోదరి ఇంట్లో ఉంటూ క్యాటరింగ్ పనులు చేసుకుని జీవిస్తోంది. ఈ నెల 7న మొక్కు తీర్చుకునేందుకు తన స్కూటీపై ఒంగోలు వెళ్ళి తిరిగి వస్తుండగా, నూతన బైపాస్ రోడ్డుపై నాదెండ్ల అండర్‌పాస్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. గాయాలైన నాగమణిని 108 సాయంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరి శిరీష ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య



నాదెండ్ల: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామానికి చెందిన గోరంట్ల సామ్రాజ్యం (80) గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమార్తె పూనాటి విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం



నాదెండ్ల: అగ్నిప్రమాదంలో పదెకరాల గడ్డివామి దగ్ధమై సుమారు రూ.1 లక్ష నష్టం వాటిల్లిన సంఘటన శనివారం సాతులూరు గ్రామంలో చోటు చేసుకుంది. నరసరావుపేట ఫైర్‌ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఈదర సాంబశివరావు పదెకరాల వరిగడ్డిని రూ.1 లక్షకు కొనుగోలు చేసి తన చావిడీలో వామిని ఏర్పాటు చేసుకున్నాడు. సాయంత్రం 5 గంటల సమ యంలో గడ్డివామి నుండి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అరికట్టారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. సుబ్బారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్టామహోత్సవం



ఆలయానికి వచ్చిన డాక్టర్ గోపిరెడ్డికి స్వాగతం పలికిన గ్రామస్తులు


రొంపిచర్ల : మండల కేంద్రంలో శనివారం నూతన ఆలయ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన ఆలయంలో శ్రీ అంకమ్మతల్లి, శ్రీ పోతురాజు విగ్రహాలను ప్రతిష్టించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నూతన ఆలయ, విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం వైభవంగా సాగింది. ఆడపడుచులు గ్రామంలో తమ పుట్టిళ్ళకు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. పుట్టిళ్ళకు వచ్చిన ఆడపడుచులకు తమ సోదరులు నూతన వస్త్రములు బహూకరించారు. అదే విధంగా ఆనవాయితీగా ఆడపడుచులు కూడా తమ సోదరులకు నూతన వస్త్రములు బహూకరించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. రాత్రివేళ ఆలయంలో భజనా కార్యక్రమం నిర్వహించారు.



అందమా... అందుమా..!

స్థానిక గీతాంజలి విద్యాసంస్థలలో బ్యూటీవిత్ బ్రెయిన్ కాంటెస్ట్ 2024-25 ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వారి ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో గీతాంజలి విద్యాసంస్థల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు. -వినుకొండ

ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం



చిట్టా విజయ్‌భాష్కరరెడ్డి

సత్తెనపల్లి: వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సూపర్ సిక్స్ అమలు ఊసే లేదన్నారు. 80 మంది అధికార కూటమి శాసనసభ్యుల పనితీరు బాగాలేదని ఓ సర్వే సంస్థ రిపోర్ట్‌ను సీఎం చంద్రబాబుకు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పరిపాలన అందించడానికి ప్రయత్నించాలని పేర్కొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

గురజాల రూరల్: ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కర్రలతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దాడిలో ఇరువర్గాల్లో అటువైపు ఇరువురికి, ఇటువైపు ఇరువురికి గాయాలు అయ్యాయి. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.